అర్హులకు సంక్షేమ ఫలాలు : ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అర్హత ప్రామాణికంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందిస్తున్నారని ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని తెల్లంవారిగూడెం, దొరమామిడి సచివాలయాల పరిధిలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ వ్యవస్థతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దళారుల వ్యవస్థ లేకుండా సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి సభ్యులు ఉదయం రామలింగం, వైసిపి మండల కన్వీనర్ ఆల్లూరి రత్నాజీ, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, ఎంపిడిఒ కె.వాణి, తహశీల్దార్ ఎస్.ఎస్.శాంతి, వ్యవసాయాధికారి సుమలత పాల్గొన్నారు.

పిఎం ఆవాస యోజన పూర్తయ్యేదెప్పుడు..!

జిల్లాలో 88,952 ఇళ్లు మంజూరు

12,665 మాత్రమే పూర్తి

బిలో బేస్‌మెంట్ లెవెల్‌లో 52 వేల ఇళ్లపైనే

ఎప్పటికి పూర్తయ్యేనో అర్థంకాని పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రధానమంత్రి ఆవాసయోజన పథకంలో మంజూరైన ఇళ్లనిర్మాణం జిల్లాలో ఎప్పటికి పూర్తవుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. 2022 నాటికి ఇళ్లు పూర్తిచేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. సొంత ఇల్లులేని వారు, కచ్చా ఇళ్లు, శిథిలావస్థ దెబ్బతిన్న ఇళ్లు కలిగిన వారు ఈ పథకానికి అర్హులుగా కేంద్రం పేర్కొంది. కానీ 2022 పూర్తవుతున్నా మంజూరైన ఇళ్లకు సంబంధించి జిల్లాలో ఒకటోవంతు కూడా పూర్తికాలేదు. అర్హుల జాబితా తయారు చేయడం ఆలస్యం కారణంగా గడిచిన రెండునెలలు క్రితమే నిధులు విడుదలైనట్లు తెలుస్తోంది. పిఎం ఆవాస యోజన గ్రామీణ పథకంలో ఇళ్లకు రూ.లక్షా 80 వేలు ఆర్థిక సాయం లబ్ధిదారులకు అందుతోంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.72వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.78 వేలు, ఉపాధి హామీ పథకం నుంచి రూ.30వేలు లబ్ధిదారునికి అందేవిధంగా ఈ పథకం రూపొందించారు. అర్బన్ ప్రాంతాల్లో నిధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటాల్లో కొంత వ్యత్యాసం ఉంది. జిల్లాకు వేలాది ఇళ్లు మంజూరైనప్పటికీ

పునాది స్థాయిలో ఉన్న ఇళ్లు (ఫైల్)

ఇళ్ల నిర్మాణం మాత్రం మందకొడిగా సాగుతోంది. పిఎం ఆవాస యోజన కింద ఏలూరు జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 88,952 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు మంజూరైన ఇళ్లు 25,098 ఉన్నాయి. అర్బన్ గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయిన ఇళ్లు ఇప్పటి వరకూ కేవలం 12,665 మాత్రమే. ఏలూరు జిల్లాకు మొత్తం 88,952 ఇళ్లు మంజూరుకాగా ఇప్పటి వరకూ గ్రౌండ్ అయినవి 84,352 ఉన్నాయి. రిజిష్టర్ కానివి ఇంకా 4,600 వరకూ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకూ లెక్కల ప్రకారం పునాదులు కూడా దాటనవి 52,741కాగా, పునాదుల దశలో 10,030 ఇళ్లు ఉన్నాయి. రూఫ్ లెవిల్‌లో 3,353, రూఫ్ లెవల్ దాటినవి 5,563, పూర్తయిన ఇళ్లు 12,665 మాత్రమే. ఈ పథకంలో ఇళ్ల నిర్మాణాలు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతంలో ఇళ్లనిర్మాణానికి ఇప్పటి వరకూ చేసిన ఖర్చు రూ.12వ కోట్లు మాత్రమే.

ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతోనే ఆలస్యం..!

నవరత్నాల పథకంలో అందరికీ ఇళ్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా దృష్టిసారించిన పరిస్థితి ఉందని, పిఎం ఆవాస యోజన ఇళ్లనిర్మాణాలపై పెద్దగా దృష్టిసారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ఇళ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదన్న చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. అదే క్రమంలో కేంద్రం నుంచి నిధుల మంజూరు ఆలస్యం కారణంగా ఇళ్ల నిర్మాణం ముందుకు సాగలేదన్నట్లు చెబుతున్న పరిస్థితి కూడా ఉంది. ఈ పథకంలో నిర్మిస్తున్న ఇళ్ళన్నీ దాదాపు లబ్ధిదారుల సొంత స్థలాల్లోనే జరుగుతున్నాయి. ఇళ్లనిర్మాణం మందకొడిగా సాగుతుండటంతో లబ్ధిదారుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ పథకంలో మంజూరైన ఇళ్లనిర్మాణంపై ప్రభుత్వం దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు. గృహనిర్మాణ అధికారులు ఇటు నవరత్నాల్లో భాగంగా జరుగుతున్న పేదలందరికీ ఇళ్ల నిర్మాణం, ఇటు పిఎం ఆవాసయోజన ఇళ్లనిర్మాణ పర్యవేక్షణలో భారంగా మారుతోంది. పిఎం ఆవాస యోజన పథకంలో చేపట్టిన ఇళ్లనిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయో ఇప్పటికైనా నిర్దిష్ట గడువు పెట్టుకుని ముందుకుసాగితే లబ్ధిదారులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ ప్రారంభంలో కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంధన వనరులను అవసరం మేరకు పొదుపుగా, సమర్థంగా వాడుకోవడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఈ నెల14వ తేదీ నుండి 20 వరకూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంధన పొదుపు వారోత్సవాలను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 'విద్యుత్ పొదుపు మన అందరి బాధ్యత' నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో విద్యుత్ పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ఇంధన వనరులను, విద్యుత్ పొదుపుగా వాడాలని, అవసరాల మేరకే విద్యుత్‌ను వినియోగించుకోవాలన్నారు. ప్రతీ కుటుంబం విద్యుత్ పొదుపు పాటించడం వల్ల ఆర్థికంగా మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యుత్ పొదుపు అంటే అవసరం ఉన్నంతవరకే విద్యుత్‌ను ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రతీ సంవత్సరం డిసెంబరులో ఈ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ 65 శాతం బొగ్గుద్వారా తయారవుతుందని సిఒ2 వాతావరణంలో కలవడం వల్ల రాబోయే తరాలకు సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. గత ఏడాది ఐఎస్ఐ మోటార్స్, ఎల్ఇడి వాడకం ద్వారా 5,600 మిలియన్ మెగావాట్ల విద్యుత్ ఆదా అయిందని, తద్వారా రూ.304 కోట్లు ఆదా అయిందని చెప్పారు. ప్రభుత్వం 10 వేలు మెగావాట్ల సోలార్ ప్లాంట్లను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇందన పొదుపులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. వారోత్సవాల్లో భాగంగా రోజుకొక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. ఈ ర్యాలీ ఫైర్ స్టేషన్ సెంటర్ వరకూ నిర్వహించారు. అక్కడ మానవహారం చేపట్టారు. అనంతరం ఆర్ఆర్ పేట నుండి విద్యుత్ భవన్‌కు ర్యాలీ చేరింది. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డిఇలు, ఎడిలు, ఎఇలు, సబ్ ఇంజినీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల్లో రక్తహీనత నివారణకు చర్యలు : కలెక్టర్

ఏలూరు: గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత కేసులు ఎక్కువగా నమోదవుతున్న దృష్ట్యా వైద్య సేవలు, పౌష్టికాహార అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీరాజ్, ఐసిడిఎస్, ఎన్ఆర్ఇజిఎస్, వైద్య ఆరోగ్యం, డిఆర్‌డిఎ, డిపిఒ, గడప గడపకూ మన ప్రభుత్వం, స్పందన అంశాలపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో నాడు-నేడు, రైతుభరోసా, అంగన్‌వాడీ భవనాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్, కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో గర్భిణుల్లో ఎక్కువగా రక్తహీనత వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని వీటిపై సంబంధిత ఎఎన్ఎం, ఆశా వర్కర్లు తరచూ వారి ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. ఫీవర్ సర్వే, డెంగీ కేసులపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని, దీనిపై ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ, ఎంపిడిఒలు పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠశాలల్లో ఉన్న ఆర్ఒ ప్లాంటు పనిచేసేలా చూడాలని, ఒకవేళ రిపేరు వస్తే వెంటనే చేయించాలని దీని బాధ్యత ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలని ఆదేశించారు.

ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులుగా చోడగిరి శ్రీనివాస్

ఏలూరు అర్బన్: ఎపి ఎన్‌జిఒల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎపి ఎన్‌జిఒ భవనంలో బుధవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శ్రీనివాస్ ప్యానల్ జిల్లా ఉద్యోగుల సమక్షంలో ఎన్నికైంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా ముందుండి యూనియన్ తరపున పోరాటాలు సాగిస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

ట్రిపుల్ ఐటి విద్యార్థుల స్వచ్ఛభారత్

నూజివీడు : నూజివీడు ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్‌లో భాగంగా బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ 1,5,7 యూనిట్లకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శ్రావణి కనకకుమారి మాట్లాడుతూ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంతో చలాకీగా స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. వ్యర్థాలను వినియోగించి కొన్ని వస్తువుల తయారీ, ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ లక్ష్మణరావు, బొత్స శ్రీనివాసరావు, డాక్టర్ సీతాపతిరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉద్యోగులకు జీతాలివ్వలేని స్థితిలో జగన్ : టిడిపి

ముసునూరు: జీతాలు కుడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని చక్కపల్లిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎంఎ జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి గద్దే రఘుబాబు, మందలపు ధర్మరాజు, పాకనాటి సీతారామ్, కాటేపల్లి సత్యనారాయణ, కాటేపల్లి ప్రసాదు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఎస్‌సిల అభివృద్ధి

నూజివీడు: ఎస్‌సిల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు యార్ల సుజీవరావు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీక ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఎస్‌సి సెల్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు టిడిపి హయాంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ కింద వందల కోట్ల రూపాయలతో కాలనీలు అభివీద్ధి చేయడంతో పాటు అనేకమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. కానీ నేడు జగన్ రెడ్డి ఎంతమంది యువతకు ఉపాధి కల్పించారో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. ఈ నెల 17న ఏలూరు ఫైర్ స్టేషన్ నుండి పాత బస్టాండ్ వరకు జరిగే ఎస్‌సి గర్జన ర్యాలీ విజయవంతం చేసేందుకు నూజివీడు నియోజకవర్గం నుండి ఎస్‌సి సెల్ కార్యకర్తలు, కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, నూజివీడు అధ్యక్షులు అరికోటి సంగీతరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు జగదీష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగతి' సేవలు అభినందనీయం

జంగారెడ్డిగూడెం: జగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి అన్నారు. బుధవారం ప్రజాసంఘాల సహకారంతో జగతి ఫౌండేషన్ ప్రతినిధులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చిన్న పిల్లలకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగతి ఫౌండేషన్ స్థానిక సమన్వయకర్త కవిత మాట్లాడుతూ జగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధిని కల్పించేందుకు కుట్టుమిషన్ల శిక్షణను బుట్టాయిగూడెం మండలంలోని రెడ్డిగణపవరం, దొరమామిడి, ప్రాంతాల్లో నిర్వహించామని తెలిపారు. సుమారు మూడు నెలల పాటు 60 మందికిపైగా శిక్షణ తీసుకున్నారన్నారు. పేద పిల్లలకు పుస్తకాలు, యూనిఫారాలు, ఉన్నత విద్యను అభ్యసించే వారికి స్టడీ మెటీరియల్స్ అందజేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం, ప్లాస్టిక్ రహిత వస్తువులను ఉత్పత్తులను వినియోగంలోనికి తెచ్చేందుకు, ప్రజలకు ప్లాస్టిక్ రహిత ఉత్పత్తులపై అవగాహన కల్పించేందుకు జగతి ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి గణపవరం గ్రామ సచివాలయ మహిళా కానిస్టేబుల్ యు.లలిత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పి.మంగరాజు, జి.పవన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంజీవరత్నం పి రామకష్ణ, జిల్లా కమిటీ సభ్యులు దానియేలు, ప్రభాకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి సూర్యకిరణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని కౌన్సిల్ సమావేశాలెందుకు : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యలపై చర్చించలేని ఏలూరు కార్పొరేషన్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం దండగ అని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన నగర కమిటీ సమావేశం బి.సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కిషోర్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన జరిగిన ఏలూరు మున్సిపల్ సర్వసభ్య సమావేశం తీరు తీవ్ర గర్హనీయమన్నారు. ఎలాంటి చర్చా చేయకుండా 65 అంశాలను అరగంటలో ఆమోదించారన్నారు. సొంతపార్టీకి చెందిన కార్పొరేటర్లు అడిగనప్పటికీ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఇదేమి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ఏలూరు 50 డివిజన్లలో దాదాపు వంద మురికివాడలున్నాయని, ఈ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని పాలకవర్గాన్ని ప్రశ్నించారు. ఇందిరమ్మ కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి లైట్లు తదితర సమస్యలున్నాయన్నారు. వెంకటాపురం పంచాయతీ ప్రజలకు సున్నపు నీరు వస్తుందని, గోదావరి జలాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ఏం చర్చించారని ప్రశ్నించారు. నగరంలో ప్రధాన రోడ్లు పాడయ్యాయని, ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారని వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. నగరంలో కుక్కలు, పందుల బెడద అరికట్టడానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. తమ్మిలేరు రక్షణ గోడ నిర్మాణంపై చర్చే లేదన్నారు. టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. బావిశెట్టిపేట, సుందరయ్య కాలనీ, కుమ్మరి రేవు తదితర ప్రాంతాల్లో రోడ్లు, వీది లైట్లు, తాగునీటి సమస్యలున్నాయని వీటిపై చర్చించలేదన్నారు. నగరంలో క్రైస్తవ శ్మశాన వాటిక నిండుకుందని, వారికి ప్రత్యామ్నాయం ఏమైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. నగరంలో విద్యుత్ శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో పార్కులు, గ్రంథాలయాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇలా అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని, అవేమీ పట్టనట్లు మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం జరిగిందన్నారు. ప్రతిపక్షానికి తావు లేకుండా ఉందన్నారు. కనీసం స్వపక్షం సభ్యుడు అడిగిన వాటికి కూడా సమాధానం చెప్పక పోవడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో నగర కమిటీ సభ్యులు వి. సాయి బాబు బి. జగన్నాథరావు, కే రామాంజనేయులు, జి.రవికిషోర్, ప్రసాద్, కనకారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితమైన 'రైతుల ఆశలపై నీళ్లు' కథనానికి జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ మండల వ్యవసాయ, ఆర్‌బికె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఏమిటో చెప్పాలని కోరారు. దీంతో రంగంలోకి దిగిన ఆర్‌బికె సిబ్బంది బుధవారం ఆయా రైతుల వద్దకు వెళ్లి గోనె సంచులు అందించారు. ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు.

ప్రజాశక్తి విలేకరిపై చిందులు

ఈ కథనం రాసిన ప్రజాశక్తి విలేకరిపై గ్రామ వ్యవసాయ సహాయకుడు పవన్‌కుమార్ చిందులేశారు. అవాకులు, చవాకులు పేలారు. విలేకరికి ఫోన్ చేసి తడిసి మొలకెత్తిన ధాన్యం ఎక్కడ ఉందో చూపాలంటూ ఇబ్బంది పెట్టారు. దీంతో ఆ విలేకరి ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీలోని కౌలురైతు ధాన్యపు రాసులను పరిశీలించాలని, అక్కడ ఈ పరిస్థితి ఉందని, మండలంలో చాలాచోట్ల కూడా ఈ పరిస్థితి ఉందని చెప్పడంతో ఆర్‌బికె సిబ్బంది అక్కడకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ తరుణంలో అటుగా వెళ్తున్న ప్రజాశక్తి విలేకరిని ఆపి 'మీరే కదా ఈ వార్త రాసింది.. దీనిపై వివరణ ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి మాకు ఆదేశాలు వచ్చాయి. మీరు కూడా ధాన్యపు రాసుల వద్ద నిలబడండి ఫొటో తీసుకోవాలి.. మేము పైకి పంపాలి' అంటూ ఇబ్బంది పెట్టారు. అంతేకాక ఆ విలేకరితో ఇష్టానుసారంగా మాట్లాడుతూ చిందులేశాడు.

ఆక్వా రైతులకు అండగా జనసేన

పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆక్వా రైతులకు జనసేన అండగా ఉంటుందని పార్టీ పొలిటికల్ అఫైర్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని నారాయణపురంలో బుధవారం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మనోహర్ పాల్గొన్నారు. ఉండి మండలం కుప్పనపూడికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త శ్రీమన్నారాయణ విద్యుదాఘాతంతో ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో పార్టీ తరపున సభ్యత్వ బీమాగా రూ.ఐదు లక్షల విలువైన చెక్కును భార్య, కుమారులకు అందించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి మనోహర్ మాట్లాడుతూ ఆక్వారైతుల కష్టాలు, సమస్యలపై పార్టీ అధ్యయనం చేస్తోందని పూర్తి సమాచారం రాగానే విధివిధానాలను వెల్లడించి లాజిస్టిక్ హబ్ ఏర్పాటు చేసి ఆక్వారంగానికి అండగా ఉంటామని పవన్‌కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. సంఖ్య ప్రధానం కాదని పరిపాలనలో నిజాయితీ ఉండాలని వైసిపిని విమర్శించారు. రాజోలులో రైతు భరోసా కేంద్రాల్లో బస్తాకు రూ.50 నుంచి రూ.వద వరకూ పన్ను కట్టాలంటూ రైతులను దోచుకోవడం దారుణమని విమర్శించారు. రైతులకు క్రాప్ హాలీడే కాదని, వైసిపికి హాలీడే ఇచ్చే రోజులు ముందున్నాయని విమర్శించారు. గోదావరి జిల్లాల్లో ఈ ఏడాది 46 మంది రైతులు అప్పులతో ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో మూడు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం తప్పుడు లెక్కలతో 1100 మంది మాత్రమేనంటూ తప్పుడులెక్కలు చెబుతోందన్నారు.



చెక్కు అందిస్తున్న నాదెండ్ల మనోహర్

జనసేన నాయకులను పోలీసులు వేధించి, అక్రమ కేసులు పెడితే అండగా ఉంటామని, ప్రతీ పోలీస్ స్టేషన్‌కు ఒక లాయర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేనకు మంచి ఆదరణ ఉందన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో జనసేనను గెలిపించాలని మనోహర్ పిలుపునిచ్చారు. పలువురు నాయకులను పార్టీలోకి ఆహ్వానించి జెండా కప్పారు. ఆక్వా రైతులతో ముచ్చటించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, మహిళలు, కార్యకర్తలతో మాట్లాడారు. తొలుత ఉంగుటూరు టోల్‌గేటు వద్ద మనోహర్‌కు ఘనస్వాగతం పలికారు.

ఏలూరు సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

కమిషనర్ షేక్ షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పలు పనులకు శ్రీకారం చుట్టినట్లు నగర కమిషనర్ షేక్ షాహిద్ తెలిపారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదేశాల ప్రకారం సర్వసభ్య సమావేశంలో పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా నగర సుందరీకరణ, అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ విలేకరులతో మాటాడుతూ కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టి, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రూ.150 కోట్లతో పోణంగిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం ఏడు గ్రామాల ప్రజలకు ప్రత్యేక వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. టూ టౌన్‌లో 50వ డివిజన్‌లోని ఎంఆర్‌సి కాలనీలో రూ.రెండు కోట్లతో వెయ్యి ఇళ్లకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ సదుపాయాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణకు నూతన వాహనాలు, జెసిబిలు, ట్రాక్టర్లు కొనుగోలు చేస్తామని తెలిపారు. శ్మశానవాటికల అభివృద్ధి పనులు చేపడు తున్నామన్నారు. మృతదేహాల తరలింపునకు కైలాస రథాల ఏర్పాటుతో పాటు, ఎనిమిది ఫ్రీజర్లను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాలుష్య రహితనగరంగా తీర్చిదిద్దేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. స్థానిక గజ్జలవారి చెరువు ప్రాంతంలోని బుద్ధ పార్కును నగరానికి మణిహారంలా తీర్చిదిద్దేందుకు యుడా నిధులు కేటాయిస్తామన్నారు. వన్‌టౌన్‌లోని వెంకన్న చెరువు ప్రాంతంలో అత్యాధునిక పార్కును నిర్మించి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల నియంత్రణకు, పందులు, కుక్కల బెడద నియంత్రణకు తగు చర్యలు చేపట్టామని తెలిపారు. పందుల పెంపకందారులకు స్థానిక పోణంగి డంపింగ్ యార్డ్‌లో రెండు ఎకరాల స్థలం కేటాయించామని చెప్పారు.

పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యం

తీరంలో ఓడరేవులు ఏర్పాటు చేయాలి - సిఐటియు జిల్లా సదస్సులో పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు - హాజరైన పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి - భీమవరం

పరిశ్రమల స్థాపనతోనే నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని, దీనికి విభజన హామీల అమలే కీలకమని పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన తీరు సరిగ్గా లేకపోగా, ఆ సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను సైతం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తుంగలోకి తొక్కి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీల అమలుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. జనవరి 2, 3, 4 తేదీల్లో స్థానికంగా జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా బుధవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో 'పారిశ్రామికాభివృద్ధి అవకాశాలు-అవరోధాలు' అంశంపై జిల్లాస్థాయి సదస్సు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ తొలిసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ జనవరి 2,3, 4వ తేదీల్లో భీమవరం పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభకు అంతా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యవక్త, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విశాఖపట్నం, హైదరాబాద్ అభివృద్ధికి ఆయా ప్రాంతాల్లో నెలకొల్పిన పరిశ్రమలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలే కారణమని అన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు ఉద్యమంలో 32 మంది తమ ప్రాణాలు బలిదానం చేశారని, అటువంటి ప్రతిష్టాత్మక విశాఖ ఉక్కును కేంద్రం ప్రయివేటీకరిస్తామనడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ విలువ రూ.మూడు లక్షల కోట్లని, రూ.15 వేల కోట్లు నష్టం వచ్చిందని కారుచౌకగా అమ్మేస్తామనడం కేంద్ర ప్రభుత్వ కుటిల నీతికి నిదర్శనమన్నారు. ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, పైగా ఉన్న ఉపాధిని హరించే విధానాలు అమలు చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ, తిరుపతిలో విమానాశ్రయాలు, నెల్లూరులో భారీ ఓడరేవు, విశాఖలో రైల్వే జోన్, విశాఖ, విజయవాడలో మెట్రో రైలు నిర్మాణం, చెన్నయ్ నుంచి విశాఖ వరకు ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం వంటి హామీలను ఇచ్చిందని, తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వాటన్నింటినీ అటకెక్కించిందని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి రూ.45 వేల కోట్లు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.15 వందల కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. రాష్ట్రం అభివృద్ధి కావాలంటే ఫార్మాస్యూటికల్, ఐటి కంపెనీలు రాయలసీమ, కోస్తాంధ్రా ప్రాంతాల్లో పెడితే అభివృద్ధికి దోహదపడతాయన్నారు. అభివృద్ధి చెందుతున్న పశ్చిమగోదావరి జిల్లాలోని నర్సాపురంలో ఓడరేవు పెడితే మరిన్ని పరిశ్రమలు వస్తాయని సూచించారు. రాష్ట్రంలో మేధావులు, విద్యావేత్తలు రాష్ట్ర అభివృద్ధిపై చర్చించాలన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సదస్సులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శులు డి.కళ్యాణి, అల్లూరి అరుణ్, మల్లిపూడి ఆంజనేయులు, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభి సీతారామయ్య, నాయకులు పి.సీతారామరాజు, సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి

కనుమూరి సత్యనారాయణరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షులు, భీమవరం

పరిశ్రమలు రావాలంటే భూమి ఉండాలి. భీమవరం వంటి పట్టణంలో భూమి దొరకడం అనేది భారీ ఖర్చుతో కూడుకున్న పని. ప్రభుత్వ భూములు ఉన్నచోట పరిశ్రమలు స్థాపిస్తే ఉపయోగకరం. ఇక్కడ వాళ్లంతా హైదరాబాద్ వంటి నగరాల్లో పెట్టుబడులు పెడుతున్నారంటే ఇక్కడ అవకాశాలు లేనట్లే. పరిశ్రమలు రావాలంటే ప్రజల్లో కూడా చైతన్యం రావాలి.

సమస్యల పరిష్కారానికి సదస్సులు దోహదం

గన్నాబత్తుల శ్రీనివాస్, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, భీమవరం

విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయి. సిఐటియు తరపున ఏర్పాటు చేసే ఏ కార్యక్రమానికైనా మా సహకారం ఉంటుంది. 175 మంది ఎంఎల్‌ఎలు, 150 మంది ఎంఎల్‌సిలు ఉన్నప్పటికీ ఎవరూ విశ్లేషించని అంశాలు లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఇటువంటి అంశాలు ఆచరణలోకి తీసుకొస్తే ఎంతో దోహదపడతాయి.

రైస్‌మిల్లులు మూతపడుతున్నాయి

చవ్వాకుల నరసింహారావు, ప్యాడీ అండ్ రైస్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, భీమవరం

1962లో భీమవరం పరిసర ప్రాంతాల్లో సుమారు వంద రైస్‌మిల్లులు ఉండేవి. కాలక్రమేణా పలు మార్పులు రావడం, వ్యవసాయ సాగు తగ్గి ఆక్వా సాగు పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం 20 రైస్‌మిల్లులు కూడా తిరిగే పరిస్థితి లేదు. నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రమైన భీమవరంలో భూమి దొరకడం అనేది మాములు విషయం కాదు. అయినా పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి అనేది సాధ్యం.

అవినావభావ సంబంధం కొనసాగుతుంది

కురిసేటి రాజా, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, భీమవరం

సిఐటియు, రైస్‌మిల్లుల యాజమాన్యాలకు పూర్వం నుంచి అవినాభావ సంబంధం ఉంది. సిఐటియు అనుబంధ యూనియన్ ఉన్నచోట రైస్‌మిల్లులు బాగా తిరుగుతున్నాయి. లేనిచోట కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పరిశ్రమల స్థాపన ఎంత అవసరమో ఉన్న పరిశ్రమలను రక్షించుకోవడం కూడా అంతే అవసరం.

ప్రభుత్వరంగ సంస్థలు ఉంటేనే అభివృద్ధి

జి.జేమ్స్, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, భీమవరం

విభజన హామీల అమలు జరగకపోవడం వల్ల అభివృద్ధిలో వెనుకపడ్డాం. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే అభివృద్ధి సాధ్యం. పరిశ్రమలు నెలకొల్పకపోతే పరిస్థితి దారుణంగా తయారవుతుంది. సమస్యలపై సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో కమ్యూనిస్టులు సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తూ ఉంటారు. రాబోయే రోజుల్లో వారికి అన్ని రకాలుగా సంఘం తరపున పూర్తి సహకారం ఉంటుంది.

ధాన్యం అమ్ముకునేందుకూ కష్టాలే..!

ఇ-క్రాప్ నమోదులో తప్పిదాలు
రైతులకు అందని గోనెసంచులు

చింతలపూడిలో కల్లాల్లో ధాన్యం

ప్రజాశక్తి - చింతలపూడి

జిల్లాలో మెట్టప్రాంతంలో వరిపంట ఎక్కువ సాగు చేసే మండలంలో చింతలపూడి ఒకటి. మండలంలో 16,000 వేల హెక్టర్లలో వరిసాగు చేశారు. ఎకరానికి 30 నుంచి 35 వరకు ధాన్యం బస్తాలు దిగుబడి అవుతుంది. పంట చేతికి వచ్చే సమయానికి గోనే సంచుల సమస్య రైతులను వేధిస్తోంది. ఈ ఏడాది ఆ సమస్యతో పాటు ధాన్యం అమ్మటంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త నిబంధనలు రైతులకు తీవ్ర నష్టాలు మిగిల్చేలా చేస్తున్నాయి. గోనె సంచులు సరఫరా చేయటంలో విఫలం అయ్యారని రైతులు విమర్శలు చేస్తున్నారు.

ఇ - క్రాఫ్ట్ నమోదులో తప్పిదాలు

ప్రభుత్వం రైతు వద్ద పంట కొనుగోలు చేయటానికి ఇ-క్రాఫ్ట్ చేయించుకోవాల్సిన అవసరం ఉండగా అందులో తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఒక పంటకు బదులు మరొక పంటను నమోదు చేయటంతో పంట అమ్ముకునే సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రస్తుతం 433 ఎకరాలు ఇ క్రాఫ్ట్‌లో తప్పుగా నమోదు అయినట్లు గుర్తించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

తేమశాతంలో తేడాలు

ఆర్‌బికె కేంద్రాల వద్ద, మిల్లర్ల వద్ద తేమశాతం భిన్నంగా ఉంటుంది. ఒకచోట ఒకలా, మరొకచోట ఒకటా ఎందుకు వస్తుందో రైతులకు అర్థం కాని పరిస్థితి. ఆర్‌బికె కేంద్రాల వద్ద తేమశాతం నిబంధనలకు అనుగుణంగానే ఉందని అధికారులు చెప్పిన తర్వాత తేమశాతంలో తేడాలు ఉన్నాయని మిల్లర్లు ధాన్యం లోడులు నిలిపివేసిన సంఘటనలూ ఉన్నాయి. ఒకే ధాన్యం రెండు చోట్ల వేర్వేరుగా వస్తుంది. దీనిపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించలేదు.

రైతులకు అందని గోనెసంచులు

దళారుల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉంటున్నాయని, ఆర్‌బికె ద్వారా ధాన్యం అమ్ముకునే రైతులకు మాత్రం గోనెసంచులు దొరకడం లేదని గణిచర్ల గ్రామంలో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోనెసంచుల కోసం ఆర్‌బికెల చుట్టూ తిరుగుతున్నామని వాపోతున్నారు. అయినా గోనెసంచులు సరఫరా చేయడంలేదని, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పంట కొనుగోలు చేయండి

శ్రీనివాసరావు, రైతు, సమ్మెటవారిగూడెం

18 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ఇ క్రాఫ్ట్ నమోదులో తేడాలు ఉండటంతో నా పంట రొనుగోలు చేయటం లేదు. నా పంట 20 రోజులుగా కల్లాల్లోనే ఉంది. పంటను కొనుగోలు చేసి ఆదుకోండి.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - భీమడోలు

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు విమర్శించారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం సిఐటియు, కెవిపిఎస్, రైతులు బృందాలుగా ఏర్పడి మండలంలోని సూరప్పగూడెం, గుండుగొలను గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపై ధాన్యం ఆరపెడుతున్న రైతులను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం సేకరిస్తామన్న ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోలేదన్నారు. మండలం నుంచి సుమారు 45 వేల నుంచి 50 వేల టన్నుల ధాన్యం దిగుబడి రాగా ధాన్యం కొనుగోలు లక్ష్యం 28 వేల టన్నులకు మాత్రమే పరిమితం చేసిందన్నారు. దీనిలో ఇప్పటివరకు నిబంధనల సాకుతో 60 శాతం మేరకు మాత్రమే ధాన్యం కొను గోలు జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిచిన కారణంగా పది శాతం వరకు రైతులు నష్టపోయారని తెలిపారు. తేమ శాతానికి సంబంధం లేకుండా వీరి నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వై.సాల్మన్ రాజు, కెవిపిఎస్ మండల కన్వీనర్ టి.సమన్‌బాబు, రైతులు కెడివి.ప్రసాద్, ఆగ్నేస్‌తో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు అవస్థలు పడుతున్నారని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి అక్కడ రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెప్పేదానికి చేసే దానికి పొంతన లేదన్నారు. సంచులు, లారీలు రాకపోవడంతో ఎగుమతి నిలిచిపోయిందన్నారు. అధికారులు స్పందించి లారీలను పంపించాలని కోరారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వ పథకాల లబ్ధి అందని అర్హులైన లబ్ధిదారులు సమస్యను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న గడపగడపకూ మన ప్రభుత్వం 103వ రోజు కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ పుళ్లలో బుధవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా రూ.ఆరు లక్షల వ్యయంతో పనుల పూర్తయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం తన రాక పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జగనన్న కాలనీ సందర్శించి అక్కడ గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దాయం సుజాత ప్రసాద్, ఎంపిపి కె.రామయ్య, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా, ఎఎంసి చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక సమస్యలపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. స్థానిక పదో వార్డులో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ బోధనసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో 13 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తల సేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 30 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత ఆర్ఎస్ఆర్.నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్ని, డాక్టర్ ఆర్ఎస్ ఆర్కె.వరప్రసాదరావు, బొమ్మారెడ్డి పద్మజావాణి, డాక్టర్ జి.వైకుంఠరావు పాల్గొన్నారు.

పిన్నమనేని మధు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మక్కినవారిగూడెనికి చెందిన టిడిపి మాజీ మండల అధ్యక్షులు పిన్నమనేని మధుసూదన్ మాతృమూర్తి శోభాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె దశదిన కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మధు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసు, పోలవరం నియోజకవర్గంలోని మండలాల నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన గన్నిన సురేంద్ర

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలో లోకేష్ చేపడుతున్న పాదయాత్రలో భాగంగా పోలవరం నియోజకవర్గంలో చేపట్టనున్న పాదయాత్రపై తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు గన్నిన సురేంద్ర, యువకులు లోకేష్‌ను బుధవారం కలిసి చర్చించినట్లు సురేంద్ర తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ నెల 15న పాదయాత్రలో అధికారికంగా ప్రకటన విడుదల చేస్తారని, నియోజకవర్గంలో రూట్ మ్యాప్ విడుదల చేస్తామని లోకేష్ చెప్పారని తెలిపారు.

ఘనంగా రివైవల్ ఐక్య క్రిస్మస్

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురంలో మంగళవారం రాత్రి పెనుమేలు ప్రార్థన మందిరం పాస్టర్ దానియేల్ రాజ్ ఆధ్వర్యంలో యేసు సువార్త సేవకుల సహకారంతో రివైవల్ ఐక్య క్రిస్మస్ వేడుక స్థానిక సొసైటీ ఎదురుగా జెడ్‌పిటిసి సభ్యులు సూరిబాబుకు చెందిన స్థలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మండల కమిటీ సభ్యులు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పారు. తెలుసు స్థానిక హైస్కూల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.

చాట్రాయి : మండలంలోని చనుబండ గ్రామంలో పాస్టర్ వై.పురుషోత్తంచౌదరి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప అప్పారావు, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి హాజరై మాట్లాడారు. ఈ వేడుకల్లో సర్పంచి విస్సంపల్లి జ్యోతి, కృష్ణారావుపాలెం ఎంపిటిసి సభ్యులు చింతగుంట్ల వెంకటేశ్వరరావు, ఎం.వరంజ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

జిల్లా వైద్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీ నుంచి 19 వరకు గణపవరం నిడమర్రు మండలాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి రెండు తరగతులకు చెందిన విద్యార్థులకు ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు గణపవరం పిహెచ్‌సి డాక్టర్ సంతోష్‌నాయుడు చెప్పారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని సరిపల్లి-1 పాఠశాలలో విద్యార్థులకు బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి జి.విల్సన్‌బాబు, టెక్నీషియన్ బి.శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు గేదెల శ్రీనివాసు, అదనపురెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

అంత్యక్రియల నిర్వహణకు వైద్య విద్యార్థిని సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరుకు చెందిన హుస్సేన్‌గౌస్ (34) క్యాన్సర్‌తో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన గౌస్ పనులకు వెళ్తూ కుటుంబాన్ని జరిపేవాడు. గౌస్ మృతి వార్త తెలుసుకున్న అంత్యక్రియలకు అయ్యే ఖర్చును అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంజలి వైవ్రసి సహాయం చేశారు. అంతేకాకుండా భార్య, పిల్లలకు జీవన విధానానికి సహాయం చేస్తానని తెలిపారు. గౌస్ అంత్యక్రియల్లో వైస్సార్‌తో పాటు జన తండ్రి ప్రముఖ వైద్యులు అంబుల మనోహర్ పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మండలంలో నిరుపేదలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - ముసునూరు

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తేమ శాతం లేని ధాన్యాన్ని ట్రాక్టర్లు, లారీల ద్వారా మిల్లర్లకు తరలించనున్నట్లు తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ సత్యనారాయణ తెలిపారు. మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని గోపవరం, లోపూడి, వలసపల్లి, బలివే, చెక్కపల్లి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యాన్ని వారు పరిశీలించారు. ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వ లేకుండా మిల్లర్లకు పంపుతున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

శ్రీగంధం చెట్లు అపహరణ

ప్రజాశక్తి - చింతలపూడి

శ్రీగంధం చెట్లు గుర్తు తెలియని వ్యక్తులు నరికి దొంగిలించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడిలోని భట్టువారిగూడెంలో సాకా సత్యనారాయణ, మారుమూడి హెస్కియా 13 ఏళ్లుగా శ్రీ గంధం చెట్లు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికి అపహరించుకుపోయారని బాధిత రైతులు పోలీసులను ఆశ్రయించారు. ఎఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

అధికమాత్రలు మింగడంతో విద్యార్థినికి అస్వస్థత

ప్రజాశక్తి - నూజివీడు

పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని సాంఘిక సంక్షేమ శాఖ ఇంటర్ బాలికల హాస్టల్ విద్యార్థిని ఉలాస మంజూష ఫిట్స్‌తో బాధపడుతూ బుధవారం అధికమాత్రలు మింగడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైంది. ఇది గుర్తించిన ఆమె స్నేహితులు హాస్టల్ వార్డెన్ సంధ్యారాణికి సమాచారం అందించారు. అస్వస్థతకు గురైన బాలికను ఎఎస్‌డబ్ల్యూఒ శ్రీనివాసరావు నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలకు బాలికను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అధికారులు అందించిన సమాచారంతో తండ్రి భుజంగరావు తల్లి వాణి ఆసుపత్రికి చేరుకున్నారు. వీరిని ఎఎస్‌డబ్ల్యూఒ శ్రీనివాసరావు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నూజివీడు పట్టణ ఎస్ఐ శివ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

దంతాలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

దంత సంరక్షణపై పిల్లలకు అవగాహన అవసరమని చింతలపూడి ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నిరజాసుధాకర్ అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లిలో శ్రీరామ మల్టీస్పెషాలిటి దంత వైద్యశాల ఆధ్వర్యంలో బుధ వారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లలకు టూత్ పేస్టులు, బ్రష్‌లు అందించారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14 ,17 బాల బాలికల వాలీబాల్ ఎంపికలు జంగారెడ్డిగూడెం బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు జంగారెడ్డిగూడెం క్షత్రియ సేవాసమితి వారు స్పోర్ట్స్ డ్రెస్సులను బహుకరి ంచారు.

బీమా చెక్కులు అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరుకు చెందిన హుస్సేన్‌గౌస్ (34) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద రూ.పదివేలు ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ మృతుని భార్యకు వైసిపి నాయకులతో కలిసి అందించారు. ఈ నెల 11వ తేదీ ముదినేపల్లికి చెందిన కొండా సత్యవర్ధన రావు(50) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన భార్యకు ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ వైఎస్ఆర్ బీమా రూ.పదివేలు అందించారు.

మహిళా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మహిళా పోలీసులు గ్రామాల్లో శాంతి భద్రతలను పర్యవేక్షించటంతో పాటు దిశ, మహిళా సమస్యలపై స్పందించి పరిష్కరించాలని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు ఆదేశించారు. ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పండుగల సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు.

రోగులకు పాలు, పండ్లు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పుట్టినరోజు వేడుకల సందర్భంగా రోగులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు భావన ఋషి అన్నారు. బుధవారం ఫ్రైడ్ ఇండియా డైరెక్టర్ పిఎస్ఎస్.గాంధి పుట్టినరోజు వేడుక సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రి కన్స్యూమర్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా భావన ఋషి మాట్లడుతూ ఆసుపత్రిలోని రోగులకు పాలు, పండ్లు, రొట్టె పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

లబ్ధిదారులు తక్షణమే ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కోరారు. జగనన్న గ్రీన్ విలేజ్‌లో సంబంధిత శాఖల అధికారులు, గ్రామ వాలంటీర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్, లేబర్ ఛార్జీలు కలిపి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుందన్నారు. డ్వాక్రాలో ఉన్న లబ్ధిదారులకు బ్యాంకులు రుణమిస్తున్నాయన్నారు. ఈ నెలాఖరులోగా పునాదులు వేయాలని సూచించారు.

ఎన్‌జిఒ మహిళా విభాగం చైర్మన్‌గా నాగమణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి ఎన్‌జిఒ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల్లో కాగిత నాగమణి మహిళా విభాగం చైర్మన్‌గా ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా ఎన్‌జిఒ కార్యాలయంలో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. గతంలో ఇదే సంఘానికి ఉపాధ్యక్షురాలుగా ఆమె పనిచేశారు. ఆమె సేవలను మెచ్చి సంఘ సభ్యులు ఈసారి ఆమెను అధ్యక్ష పదవికి ఎన్నుకున్నారు. ఎన్నిక అనంతరం ఎన్‌జిఒ సంఘ సభ్యులు, నాయకులు, మహిళా విభాగం నాయకులు, పలువురు జర్నలిస్టులు, కార్పొరేటర్లు చిలకపాటి డింపుల్ జోబ్, జిజ్జువరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి, నున్న స్వాతిలు నాగమణిని ఘనంగా సత్కరించారు. నాగమణి భర్త కాగిత మాణిక్యరావు సీనియర్ జర్నలిస్ట్, ఐజేయు సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఎపిడబ్ల్యూజెయు) ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులుగా, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మీడియా రంగంలోని అనేక స్థాయిల్లో అయన సేవలందించారు. ప్రస్తుతం ఆయన మాజీ ఉపముఖ్యమంత్రి, ఏలూరు శాసనసభ్యులు ఆళ్ల నాని పిఆర్‌ఒగా పని చేస్తున్నారు.

మా నిధులు మాకే ఖర్చు చేయాలి

తేరగూడెం దళితులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

తమ గ్రామానికి కేటాయించిన నిధులను తమ గ్రామాభివృద్ధికే ఖర్చు చేయాలని మండలంలోని పేరూరు గ్రామ పంచాయతీ శివారు తేరగూడెం దళితులు అధికారులను వేడుకుంటున్నారు. బుధవారం తేరగూడెం గ్రామస్తులు ముదినేపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. గతంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ డిఎన్ఆర్‌కు తేరగూడెం రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయన స్పందించి రూ.తొమ్మిది లక్షలు మంజూరు చేశారన్నారు. గ్రామ సర్పంచి పి.మాధవి తేరగూడెంలో రోడ్లు నిర్మించేందుకు పంచాయతీ తీర్మానం చేయడంలేదన్నారు. గ్రామానికి కేటాయించిన నిధులతో సర్పంచి మాధవి పేరూరులో రోడ్లు వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై మాట్లాడేందుకు పలుమార్లు సచివాలయానికి వెళ్లినా ఆమె అందుబాటులో ఉండడంలేదన్నారు. సర్పంచి, కార్యదర్శి పనులు చేసేందుకు వెంటనే తీర్మానం చేయాలని, లేకపోతే రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై కార్యదర్శి రమణను వివరణ కోరగా రెండు రోజుల్లో పంచాయతీ పాలకవర్గంతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చదువుల పట్ల శ్రద్ధ, సమాజం పట్ల అవగహన, తల్లితండ్రులు పట్ల గౌరవ బాధ్యతలు, సోషల్ మీడియా పట్ల అప్రమత్తత వంటి ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. స్థానిక ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ కళాశాల సిఇఒ వి.తులసీరామ్‌తో కలిసి మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి వక్తిత్వ వికాస తరగతులు నిర్వహించడం ద్వారా వారి భవిష్యత్‌ను వారే తీర్చి దిద్దుకోవడానికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ ఎ.మురళీకృష్ణ ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, సిహెచ్.సత్యనారాయణ, సిహెచ్.శివకుమార్, కళాశాల ఎఒలు కె.మల్లికార్జునరావు, వి.రాట్నాలు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి చేలు.. ఆందోళనలో రైతులు


పంట చేలో నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజలో వరి చేలు నీట మునిగాయి. ఆక్వా సాగు చేసే రైతులు తమ చెరువుల్లోకి నీటిని నింపటానికి పంట కాల్వ ద్వారా నీటిని తీసుకువెళ్లడంతో పంట కాల్వ వెంబడి ఉన్న వరిచేల్లోకి నీరు వెళ్లి కోసిన వరి పనలు, నీట మునిగాయని వరి రైతులు చెబుతున్నారు. వంద ఎకరాల్లో కోత దశకు వచ్చిన వరి, కోసిన వరి పనలు నీట మునిగాయంటున్నారు. కాల్వకు నీరు సరఫరా చేసే లాకు శిథిలావస్థకు చేరినా అధికారులు స్పందించడంలేదన్నారు. దీంతో పోల్‌రాజ్ కెనాల్‌కు నీటి మట్టం పెంచి చేపల చెరువులకు జలవనరుల శాఖ అధికారులు నీటిని విడుదల చేస్తున్నట్లు రైతులు తెలిపారు. కోతలు కోసే దశలో నీరు ఆకస్మాత్తుగా వచ్చి చేలను ముంచి వేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఆరుతడి పంట మినుము విత్తనాలు చేల్లో చల్లామని, చేల్లో నీరు నిలిచిపోవడంతో విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేదని చెప్పారు. చేలల్లో నీరు బయటకు వెళ్లడానికి కనీసం వారం రోజులు పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా రైతులు స్వార్థం కారణంగా పంట నష్టపోయిన తమకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రామకృష్ణకు జయమంగళ పరామర్శ

కైకలూరు రూరల్ : మండలంలోని గోపవరంలో ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన టిడిపి నాయకులు కంచెర్ల రామకృష్ణను ఆయన నివాసం వద్ద మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకున్నా ప్రాణనష్టం సంభవించకుండా రక్షించుకోవచ్చని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై బుధవారం అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులందరూ హెల్మెట్‌ను ధరించాలని చెప్పారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే గురువులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తప్పనిసరని ప్రిన్సిపల్ బి.పెద్దిరాజు అన్నారు. వసతి గృహంలో బుధవారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులంలో చదివిన ప్రతి విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురం ప్రధాన కూడలిలో బుధవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆచంట అనిల్, జోనుబోయిన సొంబాబు, కాల్నిడి రాంబాబు, బిసి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండపల్లి రవి, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్‌చౌదరి పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గంలో ఎన్నికలు పెడితే టిడిపి విజయం సాధించడం ఖాయమని టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని సమ్మెటవారిగూడెం 18వ వార్డులో బుధవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు ఇంటింటికి వెళ్ల ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, క్లస్టర్ ఇన్‌ఛార్జులు తాటి అప్పారావు, మన్యం సత్తిబాబు, పల్లె పరదేసి, ఐ టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం రాత్రి నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యానికి గురైన టిడిపి సీనియర్ నాయకులు, మాజీ వైసి ఎంపిపి కొల్లి వరప్రసాదరావును టిడిపి మండల అధ్యక్షులు మరిడి వెంకటేశ్వరరావు బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు పుచ్చకాయల నోబుల్ రెడ్డి, మాజీ ఎంపిపి కందుల కృష్ణ, చీకటి చెన్నారావు, పి.లక్ష్మీనారాయణ, బొర్రా నాగేశ్వరరావు ఉన్నారు.

మండలంలోని జనార్ధనవరం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షులు మరిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, విజయ మిల్క్ జిల్లా డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, పసుపులేటి కోటేశ్వరరావు, మాజీ ఎంపిపి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కంచర్ల హనుమంతరావు, మండల కార్యదర్శి పి.దుర్గారావు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అనగా పశ్చిమ గోదావరి జిల్లా, పెనుగొండ మండలం, నడిపూడి గ్రామ కాపురస్తులు, కడలి చిన వెంకన్న గారి కుమారుడు వీర వెంకట సత్యనారాయణ గారు నాకు ఇచ్చిన నంజాయిషీపై తెలియజేయునది ఏమనగా ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు ఆస్తిని నా క్లయింట్‌కు తన అన్నగారైన అయిన కడలి వెంకట నారాయణ గారు ది.23.04.2015వ తేదీన వ్రాసి యిచ్చిన వీలునామా ద్వారా సంక్రమించిన ఆస్తి అయివుండి తన అన్నగారి మరణానంతరము నుండి నా క్లయింటు సమస్త స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. సదరు షెడ్యూలు ఆస్తిపై నా క్లయింటుకు తప్ప వేరేవారెవ్వరికినీ ఎటువంటి హక్కుగాని ఏ విధమైన సంబంధములు గాని లేవని ఇందుమూలముగా తెలియపచడమైనది.

షెడ్యూలు ఆస్తి వివరము : పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలోని తణుకు సబ్‌డి లోని తణుకు మండలం తేతలి గ్రామ పంచాయితీ ఏరియా లోని తేతలి గ్రామం తాలూకు ఆర్.ఎస్.నెం.48/1బి మరియు ఆర్.ఎస్.నెం.49/4బి దాఖలా రెండు ప్రతులుగా గల భూమి మొత్తం చ॥గ॥2307.20లు. అందులోని నానావిధ ఫలవృక్షములు మరియు సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.

వి.వి. సత్య సాయి, అడ్వకేట్,
టీచర్స్ కాలనీ, కె.సావరం పంచాయితీ
తణుకు, సెల్ : 94403 72736

డాక్యుమెంట్ పోయినవి

ఏలూరు జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామ కాపురస్తులయిన కొప్పెల్లా సత్యనారాయణ రాజు, తండ్రి: కృష్ణంరాజు అను నాకు డాక్యుమెంట్ నెం. 502/1992, అను దస్తావేజు గణపవరంలో జిరాక్సు తీసుకొనుట కొరకు సెంటర్‌కు వెళ్ళి జిరాక్సు తీయించుకొని కవరులో పెట్టుకొని కవరును మోటారు సైకిల్‌కి తగిలించుకొని ఇంటికి వస్తుండగా కవరు దారిలో ఎక్కడో పడిపోయినది. మళ్ళీ ఎంత వెతికినా దొరికలేదు. కావున ఈ దస్తావేజు దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

కొప్పెల్లా సత్యనారాయణ రాజు
తండ్రి: కృష్ణంరాజు, గణపవరం (గొల్లలదిబ్బ)
ఫోన్: 90804 27363

IN THE COURT OF THE HON'BLE V TH JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD

O.S.No.1690 of 2016

Between:
Union Bank of India, [Erstwhile Andra Bank] Credit Card Division, Koti, Sultan Bazar, Hyderabad
Rep. by its Chief Manager
...Plaintiff.

AND

R-1. Sri Goshtu Venkateswarlu (Died)
R-2. Smt. Goshtu Pushpavathi W/o. Late Sri. Goshtu Venkateswarlu, Occ: House Wife, H.No. 6-2/57/3, Venkata padmavathi Nilayam, Sugar Colony, Palakol, 534 260. West Godavari
...Defendant

The Plaintiff has filed the above Numbered suit against you for recovery of Rs. 1,66,625.00 ps. (Rupees One Lakh Sixty Six Thousand Six Hundred And Twenty Five Only) due under Bank credit card together with service charges and costs, the same stands posted to 26-12-2022 for your appearance in person or through duly appointed advocate at 10.30 am and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)

SMT. TVV SAI NAGA LAKSHMI
Advocate
TVV Law House
Flat No. 610 B, Amrutha Estates,
Himayatnagar, Hyderabad - 029.
e-mail : tvvlawhouse@gmail.com
Phone : 9391319514.

నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, ఏలూరు, ఏలూరు జిల్లా

O.S.No. 522/2011

Between:
1) Sri. Kotti Veera Ramamohana Rao
2) Sri. Kotti Muralidhara Rao
...Plaintiff

AND

1) Sri. Singara Namassivaya Rama Kriahna Brahmananda Rao (Died) & 11 Others
...Defendants

TO:
D-8: Sri. Singara Yesu Prabhudasu, S/o. Late Singara Namassivaya Rama Krishna Brahmanandarao, Employee, Resident of D.No. 20B-2-1/3, C/o. Muthayalarao, Sekhar Street, Gandhinagar, Eluru, Eluru Dt., Eluru JCJC.
D-9: Smt. Mekala Vijaya Lakshmi, W/o. Mekala Gopi, House Wife, Resident of D.No. 20B-2-1/3, C/o. Muthayalarao, Sekhar Street, Gandhinagar, Eluru, Eluru Dt., Eluru JCJC.
D-10: Sri. Singara Sureshkumar, S/o. Late Singara Namassivaya Rama Krishna Brahmanandarao, Private Employee, Resident of D.No. 20B-10-16, Sekhar Street, Gandhinagar, Eluru, Eluru Dt., Eluru JCJC.
D-11: Smt. Kilarapu Geetha, D/o. Late Singara Namassivaya Rama Krishna Brahmanandarao, Resident of D.No. 20A-16-35, Narni Veeresalingam Veedhi, Gandhinagar, Eluru, Eluru Dt., Eluru JCC.
D-12: Sri. Singara Rajkumar, S/o. Late Singara Namassivaya Rama Krishna Brahmanandarao, Private Employee, Resident of D.No. 20B-10-16, Sekhar Street, Gandhi nagar, Eluru, Eluru Dt., Eluru JCJC.

పై ఒ.యస్.నెం. 522/2011రు గల దావా గ్రంథములో 1వ ప్రతివాది అయిన సింగర నమశ్శివాయ రామకృష్ణ బ్రహ్మానందరావు గారు కాలము చేసినందున చట్టప్రకారం వారి వారసులు అయిన మిమ్ములను సదరు పై దావాలో 8 టు 12 ప్రతివాదులుగా చేర్చి శ్రీకోర్టు వారు జారీచేసిన ఉత్తర్వులు ప్రకారం నోటీసులు మరియు సమన్లు కోర్టు నుండి మరియు రిజిస్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు మీకు పంపిననూ మీరు సదరు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని **ది.03-01-2023వ తేదీ వాయిదా రోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలయునని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు.** లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు పై దావా వాయిదా తేది : 03-01-2023

T.JAGAN MOHAN
Advocate, Eluru.